teluguislam.net



# 25. షఫాఅతే కుబ్రా

وَبَشِّرِ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ أَنَّ لَهُمْ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ ۖ كُلَّمَا رُزِقُوا
مِنْهَا مِن ثَمَرَةٍ رِّزْقًا ۙ قَالُوا هَٰذَا الَّذِي رُزِقْنَا مِن قَبْلُ ۖ وَأُتُوا بِهِ مُتَشَابِهًا ۖ وَلَهُمْ
فِيهَا أَزْوَاجٌ مُّطَهَّرَةٌ ۖ وَهُمْ فِيهَا خَالِدُونَ ﴿٢٥﴾

**అల్లాహ్ (మాత్రమే నిజానికి ఆరాధ్య దైవం). ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేనేలేడు. ఆయన సజీవుడు అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునుకు గానీ, నిద్రగానీ పట్టదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగలవాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనుక ఉన్నదానిని కూడా ఆయన ఎరుగు. ఆయన కోరినది తప్ప ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్యపరిధిలోకి రాదు. ఆయన కుర్సీ వైశాల్యం భూమ్యాకాశాలను చుట్టుముట్టి ఉంది. వాటిని రక్షించటానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు.** ***(అల్ బఖర 2 : 25)***

**ధార్మిక సోదరులారా..!**

'షఫాఅతే కుబ్రా' గురించి ఈ రోజు జుమా ప్రసంగంలో తెలుసుకుందాం. అల్లాహ్ స్వర్గాన్ని విశ్వాసులు, సత్యవంతులు, అమరవీరులు, దైవభీతిపరులకొరకు సృష్టించాడు. మరణించిన తరువాత పరలోకంలో ధన్య జీవులైన విశ్వాసులు అందులో చిరకాలం నివాసముంటారు. స్వర్గం అనేది సత్యం. స్వర్గం ఉందో లేదో అని అను మానించే వారి విశ్వాసం క్షీణించిపోతుంది. అల్లాహ్ పంపిన ప్రవక్తలందరు స్వర్గనర కాల సత్యవార్తను తెలిపారు. ప్రత్యేకంగా దివ్యఖుర్ఆన్ అనేక ఆయతుల్లో స్వర్గం, స్వర్గవనాలు గురించి ఎంతో చక్కగా వివరించింది. పేరుకు ముస్లిం అని చెప్పుకుని, స్వర్గనరకం గురించి ఊహాత్మకంగా విశ్వసించిన వారు అసలుసిసలైన స్వచ్ఛమైన విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించలేరు. విశ్వాస మాధుర్యం, రుచి వారికి ప్రాప్తమవదు.

స్వర్గవనాలు, పూతోటలు, సెలయేర్లు ఇలా అన్నింటి గురించి సూరె రహ్మాన్‌లో క్షుణ్ణంగా వివరించబడింది. స్వర్గస్తులు స్వర్గంలో ప్రవేశించిన తరువాత ఎలా స్పందిస్తారో ఖుర్‌ఆన్ ఇలా తెలుపుతుంది.

وَقَالُوا الْحَمْدُ لِلَّهِ الَّذِي صَدَقَنَا وَعْدَهُ وَأَوْرَثَنَا الْأَرْضَ نَتَبَوَّأُ مِنَ الْجَنَّةِ حَيْثُ نَشَاءُ فَنِعْمَ أَجْرُ الْعَامِلِينَ ﴿٧٤﴾

**"వారంటారు, మాకు చేసిన వాగ్దానాన్ని నిజంచేసి చూపిన అల్లాహ్‌యే సర్వస్తోత్రాలకు అర్హుడు, ఆయనే మమ్మల్ని ఈ నేలకు వారసులుగా చేశాడు. స్వర్గంలో మేము కోరినచోట స్థిర నివాసం ఏర్పరచు కోగలము. సత్కార్యాలు చేసే వారి ప్రతిఫలం ఎంత ఉత్తమమైనది.**

***(అజ్ జుమర్ 39 : 74)***

స్వర్గం అంటే ఊహలు, కలలు కావని అదో అక్షర సత్యమని ఈ దైవ వాక్యం ద్వారా మనకు తెలుస్తుంది. ఏ విధంగా ఈ ప్రపంచం ఉనికిలో ఉందో అదే విధంగా స్వర్గలోకం ఉనికిలో ఉంది. అల్లాహ్ పుణ్యకార్యాలు, సత్కార్యాలు చేసిన తన దాసులకు అందులో అన్ని రకాల అనుగ్రహాలను ప్రసాదిస్తాడు. స్వర్గం మొదటి నుండి ఉంది. అంతం లేనిది. ఖుర్‌ఆన్ గ్రంథంలో స్వర్గస్తులపై ఆధిక్యాన్ని ప్రసాదించాడు. కాబట్టి ప్రస్తావన వచ్చినప్పుడల్లా 'ఖాలిదీన ఫీహా' అనే పదం వచ్చింది. అంటే వారు శాశ్వతంగా చిరకాలం అందులోనే ఉంటారు. అల్లాహ్ మనకు కూడా స్వర్గాన్ని ప్రసాదించు గాక. ఆమీన్.

**మహాశయులారా!**

'స్వర్గం' గురించి తెలుపుతూ దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**స్వర్గం ఎలాంటి ప్రదేశం, అనుగ్రహం అంటే దానిని ఏ కన్నూ చూడలేదు. దాని గురించి ఏ చెవీ వినలేదు. మానవుల ఏ హృదయం దానిని ఊహించ నయినాలేదు.** ***(సహీహ్ బుఖారీ)***

హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఒకరోజు అందరినీ సమావేశపరచి ఈ విధంగా ప్రసంగించారు:

"ఈ రోజు ప్రపంచం పరలోకంలో ఉన్న సమస్తాన్ని నాకు చూపించటం జరిగింది. ఒక విశాలమైన మైదానంలో తొలి చివరి మానవులందర్నీ జమచేయడం జరిగింది. కాని వారందరూ తమ ముఖాల వరకు చెమటలో మునిగి ఉన్నారు. పూర్తిగా మునగటానికి దగ్గర్లో ఉన్నారు. ఆ బాధ నుండి తప్పించమని వారంతా

teluguislam.net



ఆదం (అలై) దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు: "ఓ ఆదం నీవు మానవుల తండ్రివి. అల్లాహ్ నిన్ను ప్రవక్తగా నియమించాడు. కనుక నీవు నీ ప్రభువుతో మావిషయమై సిఫారసు చెయ్యి." దానికి ఆదం (అలై) ఇలా జవాబిస్తారు: "మీకెలాంటి ఆపద ఉందో నాకు అలాంటిదే ఉంది. కనుక మీరు మీ తండ్రి అయిన నూహ్ వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా అల్లాహ్ ఆదముకు, నూహుకు, ఇబ్రాహీమ్ సంతతికి, ఇమ్రాన్ సంతతికి సర్వలోకాలపై ఆధిక్యాన్ని ప్రసాదించాడు." కాబట్టి కావున వారంతా నూహ్ (అలై) వద్దకు వస్తారు. నూహ్ (అలై)తో ఇలా అంటారు. మీ ప్రభువుతో మా విషయమై సిఫారసు చెయ్యండి. మీరు అల్లాహ్‌కు ప్రియతములు. మీ దుఆలను ఆమోదించి సత్యతిరస్కారులలో ఒక్కరిని కూడా వదలకుండా ముంచేశాడు." అప్పుడు ఆయన ఇలా అంటారు: .సిఫారసు చేసే అర్హత నాకు లేదు. మీరు ఇబ్రాహీమ్(అలై) వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా అల్లాహ్ అతన్ని తన మిత్రునిగా చేసుకున్నాడు" అని జవాబిచ్చారు నూహ్ (అలై) వారందరూ ఇబ్రాహీమ్(అ) వద్దకు వెళ్తారు. ఆయన కూడా తనకు ఆ అర్హత లేదని అంటారు. "మీరు మూసా వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా అల్లాహ్ ఆయనతో ప్రత్యక్షంగా మాట్లాడాడు." వారందరు మూసా వద్దకు వెళితే కూడా అదే విధంగా జవాబిచ్చి, ఈసా(అలై) వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా ఆయన పుట్టుగ్రుడ్డిని, కుష్ఠురోగిని దైవాజ్ఞతో నయం చేసేవారు. చనిపోయిన వారిని బ్రతికించేవారు. కాని ఈసా(అ) కూడా "నాకు సిఫారసు చేసే అర్హత లేదు, మీరు ఆదం సంతతి నాయకుని వద్దకు వెళ్ళండి. ఆయన (స) ప్రళయదినాన అందరికన్నా ముందు భూమి నుండి లేపబడ్డారు" అంటారు. అంటే ముహమ్మద్ (సఅసం) వెళ్ళండి అని అంటారు. వారందరు నా వద్దకు వచ్చి విన్నవించుకుంటారు. జిబ్రయీల్ వద్దకు వెళ్తాను. జిబ్రయీల్అల్లాహ్ వద్దకు వెళ్తారు. అతనికి అనుమతి ఇవ్వండి స్వర్గ శుభవార్త తెలుపండని అల్లాహ్ సెలవిస్తాడు. జిబ్రయీల్ ద్వారా శుభవార్త విన్న వెంటనే నేను సజ్దాలో పడిపోతాను. ఒక వారం రోజుల వరకు సజ్దాలోనే ఉంటాను. అపుడు అల్లాహ్ నాతో ఇలా సెలవిస్తాడు: ఓ ముహమ్మద్ (స)! తల ఎత్తండి, సిఫారసు చేయండి ఈ రోజు సిఫారసు ఆమోదించబడుతుంది. అప్పుడు తల ఎత్తి ప్రభువువైపు చూసి మళ్ళీ సజ్దాలో పడిపోతాను ఒకవారం నుండి మరో వారం అలానే ఉంటాను. అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: "ఓ ముహమ్మద్! తల ఎత్తండి మీ విజ్ఞప్తి ఆలకించబడుతుంది. సిఫారసు చేయండి అని ఆదేశించబడింది. నేను ఆ కృతాజ్ఞతాభావంతో సజ్దా చేస్తాను. కాని జిబ్రయీల్ (అ) నా భుజం పట్టు కుంటారు. అపుడు అల్లాహ్ నాకు దుఆ నేర్పుతాడు. దానిని ఏ మానవునికి నేర్పించడు.

నా ఓ ప్రభువా! నీవు ఆదం సంతానానికి నాయకుడిని చేశావు. నేను గర్వపడడం లేదు. నన్ను అందరికంటే ముందు సమాధి నుండి లేపావు నాకంటూ గర్వం లేదు. సిఫారసు చేస్తాను. అపుడు ప్రజలందరు సెలయేరు (హౌజ్) వద్దకు తరలివస్తారు. ఆ స్థలం సన్ఆ నుండి ఈలా వరకు ఎంత వెడల్పుగా విశాలంగా ఉందో అంతే విశాలంగా ఉంటుంది. తరువాత సిద్దీఖీన్ సత్యవంతులను పిలవండి వారు కూడా సిఫారసు చేస్తారని సెలవీయడం జరుగుతుంది. ఆ తరువాత ప్రవక్తలను పిలవండని ఆజ్ఞ అవుతుంది. ప్రవక్తలు సిఫారసు చేయటం మొదలెడతారు. ఒక ప్రవక్తతో 40 మంది ఉంటారు మరొక ప్రవక్త 5 గురు ఉంటారు. మరో ప్రవక్తతో ఒకే వ్యక్తి ఉంటారు. మరొక ప్రవక్తతో ఎవరూ ఉండరు. మళ్ళీ అమరవీరులను సిఫారసు కోసం ఆదేశించబడుతుంది. ఆ తరువాత అల్లాహ్ ఇలా సెలవిస్తాడు. నేను కరుణించేవారిలో చాలా కరుణించేవాడని. ఎవరైతే నాతో పాటు సాటి కల్పించలేదో వారందర్ని స్వర్గంలోకి తీసుకెళ్ళండి అని ఆజ్ఞాపిస్తాడు.

నరకంలో ఒకసారి చూడండి. సత్కార్యాలే చేయనివాడు ఎవడైన ఒక్కడైనా ఉన్నాడా అని అల్లాహ్ సెలవిస్తాడు. ఆ నరకంలో ఒక్కడుంటాడు. మీరు ఏ మంచి పనులు చేశారు? అని అతన్ని ప్రశ్నించబడుతుంది. నేను వ్యాపారంలో చాలా మెత్తగా సున్నితంగా వ్యవహరించేవాణ్ణి ప్రజలతో మెత్తగా ఉండేవాడిని అది తప్ప వేరే సత్కార్యం నేను చేయలేదు. అప్పుడు అల్లాహ్ ఇలా ఆదేశిస్తాడు. నా దాసులతో ఎలాగైతే మృదువుగా ప్రవర్తించారో అలాగే ఈ నా దాసుల్ని కూడా మీరు మృధువుగా వ్యవహరించండి.

అతన్ని నరకంలో నుండి బయటికి తీసి స్వర్గంలోకి పంపుతారు నరకంలో ఉన్న మరో వ్యక్తిని ఎప్పుడైన మంచిపనులు చేశావా అని అడగబడుతుంది. నేను నా సంతాననికి నేను చనిపోయిన తరువాత అగ్నిలో కాల్చి ఆ బూడిదను సముద్రపు తీరమున తీసుకుని వెళ్ళి గాలిలో ఎగరవేయమని వసియ్యత్ చేశాను. ఇది తప్ప ఇంకేమీ చేయలేదు. అలా ఎందుకు చేశావని? అల్లాహ్ అతన్ని ప్రశ్నిస్తాడు. నీ భయం వల్లె అని అతడు జవాబిస్తాడు.